

కలెక్టర్‌కు ఎలిఇ పాఠశాల విద్యార్థుల వినతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మా స్కూల్ మాకు కావాలంటూ పెనుమంట్ర ఎలిఇ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, సర్పంచి సమస్యను సోమవారం భీమవరంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ చదలవాడ నాగరాణికి వినతిపత్రం అందజేశారు. పాఠశాలను విలీనం చేసినా అంతదూరం వెళ్లలేక పాత పాఠశాలలో ఉండిపోయిన విద్యార్థులకు విద్య, రెవెన్యూ శాఖ అధికారులు న్యాయం చేయడంలేదని సర్పంచి తాడిపర్తి ప్రియాంక కలెక్టర్‌కు విన్నవించారు. తప్పుడు పత్రాలు సృష్టించి, భద్రత లేని మోడల్ స్కూల్‌కు సుమారు 32 మంది విద్యార్థులను ఆర కిలోమీటర్‌కు మించి దూరం పంపమంటున్న విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై నల్లి రోజులుగాపైగా ఆందోళన చేస్తున్నట్లు తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.

స్మార్ట్ మీటర్ల గుబులు..!

స్మార్ట్ మీటర్ల బిగింపులో విద్యుత్ శాఖాధికారుల ప్రమేయం నిల్

జిల్లాలో 200 మందితో కూడిన అదానీ బృందాలు

ఇప్పటి వరకూ పశ్చిమలో 45 వేలు, ఏలూరు జిల్లాలో 33 వేల మీటర్ల బిగింపు

2026 సెప్టెంబర్‌కు మీటర్ల బిగింపు ప్రక్రియ పూర్తి చేయాలని టార్గెట్

బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని వినియోగదారుల గగ్గోలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

స్మార్ట్ మీటర్ల బిగింపుతో జిల్లా ప్రజానీకంలో గుబులు నెలకొంది. ఇప్పటికే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో వాణిజ్య దుకాణాలకు స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024 సెప్టెంబర్ నుంచి స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రారంభించింది. ఇటీవల దాన్ని మరింత వేగవంతం చేసింది. కూటమి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్ల బిగింపు పూర్తిగా అదానీ కంపెనీకి తాకట్టు పెట్టేసిందనే విమర్శలు విన్పిస్తున్నాయి. స్మార్ట్ మీటర్ల బిగింపులో జిల్లాలోని విద్యుత్‌శాఖ అధికారుల జోక్యం లేకుండా పక్కనపెట్టేసింది. అదానీ నియమించిన 200 మందితో కూడిన బృందాలతో స్మార్ట్‌మీటర్ల బిగింపు వ్యవహారం సాగిస్తోంది. రెండు జిల్లాల్లోనూ స్మార్ట్ మీటర్ల బిగింపుపై విద్యుత్ శాఖాధికారులకు కనీస సమాచారం లేకుండా పోయిందంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. స్మార్ట్ మీటర్ల బిగింపు ముందుగా కమర్షియల్, అధికంగా విద్యుత్ వినియోగించేవారికి బిగించాలని పైనుంచి ఆదేశాలు వచ్చినట్లు చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో మొత్తం ఆరు లక్షల మూడు వేల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వాటిలో 4,58,435 గృహ వినియోగ కనెక్షన్లు ఉన్నాయి. మిగిలినవి కమర్షియల్, పరిశ్రమలు, వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. ఏలూరు జిల్లాలో మొదటి విడతగా కమర్షియల్, అధిక వినియోగం చేసే మొత్తం 1,33,155 విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పటి వరకూ 33,750 కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు బిగించారు. పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు ఆరు లక్షల వరకూ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. తొలివిడతగా 2.10 లక్షల కమర్షియల్, అధిక విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్‌మీటర్లు బిగించేలా ముందుకు సాగుతున్నారు. ఇప్పటి వరకూ 45,762 విద్యుత్ సర్వీసులకు స్మార్ట్‌మీటర్ల బిగింపు పూర్తయ్యింది. ప్రతిరోజూ నిరంతరాయంగా ప్రక్రియ సాగుతోంది. 2026 సెప్టెంబర్ నాటికి స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను పూర్తిచేసేలా ముందుకు సాగుతున్నారు. కమర్షియల్ పూర్తయ్యాక గృహవినియోగ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది.

బిల్లులు అధికంగా వస్తున్నాయంటూ గగ్గోలు

స్మార్ట్ మీటర్ల బిగింపు తర్వాత విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయంటూ వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. పట్టణాల్లో ఆస్తి పన్ను విపరీతంగా పెంచేసిన ప్రభుత్వం, ఇప్పుడు స్మార్ట్‌మీటర్ల బిగింపుతో అదనపు భారాలను మోపిందంటూ పట్టణ ప్రజలు నెత్తినోరు బాదుకుంటున్నారు. స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత వాటిని ప్రీపెయిడ్ కనెక్షన్లుగా మార్చేలా రూపొందించారు. దీంతో ప్రజల్లో స్మార్ట్ మీటర్లపై తీవ్ర ఆందోళన నెలకొంది. స్మార్ట్ మీటర్లకు సంబంధించి విద్యుత్‌శాఖాధికారులు ఎటువంటి సమాధానం చెప్పలేకపోతున్నారు. వివరాలు కావాలంటే అదానీ టీమ్ సభ్యులను అడిగి తెలుసుకోవాలని అధికారులే చెబుతుండటం గమనార్హం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించిన టిడిపి నాయకులు అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసగిస్తూ ముందుకు సాగుతున్నారు. దీంతో స్మార్ట్‌మీటర్ల బిగింపును ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో మీటర్ల బిగింపు వేగంగా సాగడం లేదని తెలుస్తోంది. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమాలు మరింత బలపడితేనే వాటికి అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

తల్లిదండ్రులను చూడకుంటే చర్యలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి



వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో కలెక్టర్ నాగరాణితోపాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి 260 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరిస్తున్న సందర్భంలో 90 ఏళ్ల వృద్ధురాలు బండి వెంకట నరసమ్మ కలెక్టర్‌ను కలిసి తనకు ముగ్గురు కుమారులని, ఒక కుమారుడు తన స్థలంలో ఇల్లు నిర్మించుకొని తనను చూడడం లేదని ఇల్లు తనకు తిరిగి ఇప్పించాలని కోరింది. ఆ వయసులో ఆమె ఎవరి సహాయం లేకుండా రావడంతో చలించిపోయిన కలెక్టర్ వెంటనే వేదిక దిగి ఆప్యాయంగా పలకరించి సమస్యను పరిష్కరిస్తానని, ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఆమె చేయి పట్టుకుని బయటకు తీసుకొచ్చి అల్పాహారం అందజేశారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ వృద్ధులైన తల్లిదండ్రులను ఎవరైనా ఇబ్బంది పెడితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తల్లిదండ్రులను బాగా చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలకు ఉందన్నారు. ఈ సమావేశంలో అధికారులు, వయోవృద్ధుల ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మె



తణుకులో ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - తణుకు

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతాప్, యూనియన్ కార్యదర్శి ఎన్.ఆదినారాయణబాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని లేదా పర్మినెంట్ చేయాలని అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, శ్రామిక మహిళా నాయకులు అడ్డగర్ల అజయ కుమారి, మున్సిపల్ యూనియన్ మాజీ గౌరవాధ్యక్షులు గార రంగారావు మాట్లాడుతూ కార్మికులు డిమాండ్స్ న్యాయమైనవన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు దువ్వాపు గంగాధర్, ఎస్.సత్యనారాయణ, ఎల్.శ్రీను, ఎ.అరుణ, ఎస్.పద్మ, పి.దుర్గ, ఎ.మల్లేశ్వరి, వి.సుధాకర్, కె.సత్యనారాయణ, ఎం.శ్రీను, కె.ధనలక్ష్మి, ఎ.లక్ష్మి నారాయణ, ఎస్.శ్రీను, ఎ.శ్రీరాములు, కె.రాంబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం నాలుగో రోజుకు చేరింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలని లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనాల వెంకటరావు, తాడికొండ జయరామకృష్ణ, ధనాల రాజు, కడమంచిలి ప్రసాద్, తాడికొండ భాను, కె.దయామని, సోమరపేట సతీష్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ షరతులు తొలగించాలి

ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద అంగన్వాడీల ధర్నా



భీమవరంలో ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - భీమవరం

అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరుకులు అందించేందుకు విధించిన ఆన్‌లైన్ షరతులను తొలగించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు, లబ్ధిదారులు ధర్నా చేసి ప్రాజెక్టు అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు ధర్నాకు మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీలో సరుకులు పొందడానికి ఆన్‌లైన్ ఫొటో అప్లోడ్ కావాలని చెప్పడం వల్ల పనికిరాని సెల్‌ఫోన్లు, నెట్‌వర్క్ అందకపోవడంతో గంటల తరబడి కేంద్రాల్లో ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనివల్ల అటు లబ్ధిదారులు ఇటు అంగన్‌వాడీ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. లబ్ధిదారులకు, ప్రజలకు అవగాహన పెంచటానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోకుండా, ఆన్‌లైన్ పేరుతో ఐసిడిఎస్ సిబ్బందిని ప్రజల దగ్గరికి వెళ్లకుండా ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. తక్షణం ఆన్‌లైన్ వ్యవస్థను రద్దుచేసి లబ్ధిదారులు సంతకాలు వేలిముద్రలతో స్వేచ్ఛగా కేంద్రాలకు వచ్చి సరుకులు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో లబ్ధిదారులతో ఆందోళన చేయటానికి అంగన్వాడీలు సిద్ధపడతారన్నారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, లక్ష్మి, వెంకటలక్ష్మి, భవాని, సూర్య ప్రభ, ఎస్తేరు రాణి పాల్గొన్నారు.

పెనుమంట్ర : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీ క్లస్టర్లు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనకు సిఐటియు మండల అధ్యక్షులు కోడి శ్రీనివాసప్రసాద్ మద్దతు తెలిపారు. జిల్లా నాయకురాలు కానూరు తులసి మాట్లాడారు. కార్యక్రమంలో సాయి మహాలక్ష్మి, పిడి పరమేశ్వరి, టిఎల్‌డి భవాని, నరసమ్మ పాల్గొన్నారు.



మొగల్తూరులో..

మొగల్తూరు : ప్రభుత్వం అంగన్వాడీల్లో ప్రవేశపెట్టిన ఎఫ్‌ఆర్‌ఎస్‌ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మొగల్తూరులోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సోమవారం అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. ఈ విధానాన్ని వెంటనే ఉపసంహరించి పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు జి.పెద్దింట్లు, జి.రాజేశ్వరి, ఎస్.స్వర్ణ, ఎ.సీతారత్నం పాల్గొన్నారు.

తణుకు : అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఫేస్ యాప్‌లు రద్దు చేసి, సెంటర్ నిర్వహణకు ఒక్క యాప్ మాత్రమే నిర్వహించాలని సిఐటియు జిల్లా శ్రామిక మహిళా నాయకులు అడ్డగర్ల అజయ కుమారి, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిడిపిఒ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మహా ధర్నా జరిగింది. అనంతరం అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, అజయకుమారి మాట్లాడుతూ కూటమి వచ్చి సంవత్సరమైనా సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదని విమర్శించారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకుంటే మళ్లీ ఉద్యమం ప్రారంభవుతుందని హెచ్చరించారు. ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బళ్ల చిన్న వీరభద్రరావు మాట్లాడారు. సిఐటియు నాయకులు గార రంగారావు, నళిని, వసంత, తులసి, నాగలక్ష్మి, సత్య, విజయలక్ష్మి, మంగతాయారు, మణి మాలతి, సత్యవతి, కనకదుర్గ, ఐద్వా నాయకులు కె.నాగరత్నం పాల్గొన్నారు.



తణుకులో..

ఆకివీడు : ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం రద్దు చేయాలని అంగన్వాడీలు విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయం వద్ద ప్రాజెక్టు అధికారి వాణి విజయరత్నంకు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ నాయకురాలు మార్తమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడారు. ఈ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల స్థాయి నాయకులు హసీనా, పైడేశ్వరి, శైలజ, శ్రీదేవి, చంద్రావతి, విశాల పాల్గొన్నారు.



ఆకివీడులో..



పెనుమంట్రలో..

గౌడ శెట్టిబలిజ కళ్యాణ మండపం పూర్తి చేస్తా

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

గత టిడిపి ప్రభుత్వంలో రూ.కోటిన్నరతో తలపెట్టిన గౌడ శెట్టిబలిజ కళ్యాణ మండప నిర్మాణం పూర్తిచేసే బాధ్యత తీసుకుంటానని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద రూ.3 కోట్లతో కళ్యాణ మండప పునర్నిర్మాణ పనులకు ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు మంత్రి రామానాయుడు అధ్యక్షత వహించి మాట్లాడారు. గత టిడిపి ప్రభుత్వంలో కళ్యాణ మండపం నిర్మాణానికి అప్పటి సిఎం చంద్రబాబు కోటి రూపాయలు మంజూరు చేయగా ఎంఎల్‌ఎ పితానితో కలిసి శంకుస్థాపన చేశానని తెలిపారు. అప్పట్లో గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం పూర్తయ్యిందని, మరో విడత రూ.50 లక్షలు మంజూరైనా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రూపాయి పని కూడా నోచుకోక వెనక్కి వెళ్లిపోయాయని తెలిపారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బిసి సంక్షేమ శాఖలో రూ.4 కోట్లు బడ్జెట్ ఉంటే రూ.3 కోట్లు నిధులు తీసుకొచ్చానని తెలిపారు. ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ మాట్లాడుతూ గౌడ, శెట్టిబలిజ సామాజిక తరగతికి అన్ని వసతులతో కూడిన కళ్యాణం మండప నిర్మాణం జరుగుతోందంటే మంత్రి నిమ్మల కృషి అని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా రూ.3 కోట్లు తీసుకొచ్చారంటే కష్టతరమైందే అన్నారు. రామానాయుడును పార్టీలకు అతీతంగా గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కళ్యాణ మండపం నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ సత్తిబాబు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ గురుమూర్తి, సామాజిక వర్గ ముఖ్య నాయకులు తదితరులు మాట్లాడారు. అనంతరం మంత్రి నిమ్మలను, ఎంఎల్‌ఎ పితానిని, ముఖ్యఅతిథులను సత్కరించారు.



కళ్యాణ మండపం పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ఉద్యోగ దిక్సూచిని వినియోగించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 23న నరసాపురం వైఎన్ కళాశాలలో ఉద్యోగ దిక్సూచి మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ జరగనుందని, యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగారాణి తెలిపారు. యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో వైఎన్‌లో హెచ్ఆర్‌డి సెంటర్లో నిర్వహించే మెగా ప్లేస్మెంట్ డ్రైవ్‌లో నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో 15 ప్రముఖ కంపెనీలతోపాటు మరికొన్ని ఇతర కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. వివిధ కంపెనీల్లో 700లకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. 18 నుండి 35 ఏళ్ల వయసు కలిగిన పురుషులు, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈ లింక్ https://naipunyam.ap.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 94508 38388, 95020 24765 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పి4లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం సమాజసేవలో భాగమేనని, మానవసేవే మాధవసేవ అని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్లో పి4లో భాగంగా మార్గదర్శకుల నమోదు, బంగారు కుటుంబాల అనుసంధానం అంశంపై సోమవారం కలెక్టర్ నాగరాణి జిల్లా అధికారులతో సమీక్షించారు. పి4 కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని తెలిపారు. సమాజంలో సంపన్నులు పేద, బలహీన వర్గాలవారిని (బంగారు కుటుంబం) దత్తత తీసుకొని చేయూతనిస్తే వారు ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, సిపిఒ కె.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

జిల్లాలో పలు చోట్ల వర్షం

ప్రజాశక్తి - ఆచంట.

ఎప్పుడెప్పుడు పడుతుందో అని ఎదురుచూస్తున్న రైతులకు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం రైతుల కళ్లల్లో ఆనందం నింపింది. దీంతో ఎట్టకేలకు సార్వా సాగు పనులు ఊపందుకున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగు ఆలస్యమైంది. ఇప్పటికే వరి నాట్లు పూర్తికావాల్సిన ఉన్నా, ఇప్పటివరకు వరకు 50 శాతం కూడా వరి నాట్లు పడలేదు. గత రెండు రోజులుగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులు సార్వా సాగుకు శ్రీకారం చుట్టారు. నియోజవర్గ పరిధిలో ఆచంట మండలంలో 10,300 ఎకరాలు, పెనుగొండ మండలంలో 12,200 ఎకరాలు, పోడూరు మండలంలో 11 వేల ఎకరాల్లో, పెనుమంట్ర మండలంలో 12 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు.రెండు రోజులుగా భారీ వర్షాలు పడడంతో రైతులు పొలం బాట పట్టారు.

మొగల్తూరు : మండలంలో సోమవారం తెల్లవారుజాము నుంచి చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కళాశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రొయ్యలు చేపల చెరువులలో ఆక్సిజన్ శాతం గణనీయంగా తగ్గి మృత్యువాత పడ్డాయి. దీంతో ఆక్వా రైతులు ఆక్సిజన్ ఉత్పత్తి కోసం ఏరియేటర్లను వినియోగిస్తున్నారు.

పెనుమంట్ర : మండలంలో ఆదివారం అర్ధరాత్రి జోరుగా, సోమవారం ఉదయం నుండి చిరుజల్లులు పడ్డాయి. కురిసిన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. దీంతో వరినాట్లు ఊపందుకున్నాయి. అయితే విద్యార్థులు, పనులకు వెళ్లేవారు ఇబ్బంది పడ్డారు.

వేడంగి సత్రం భూమిని కాపాడాలి

కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

భీమవరం: పోడూరు మండలం వేడంగి గ్రామంలోని సత్రం భూమిని ఆక్రమణల నుంచి కాపాడాలని, సత్రం భూమికి దారి ఏర్పాటు చేసి, ఏళ్ల తరబడి సాగు చేస్తున్న కౌలు రైతు కొండేటి సర్వేశ్వరరావుకు న్యాయం చేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లుకు సమస్యను విన్నవించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ వేండంగి సత్రానికి సర్వేశ్వరరావు తండ్రి, తాత అనేక సేవలు చేశారన్నారు. అయితే ఎలాంటి ఆధారం లేని వారి కుటుంబానికి అప్పటి సత్రం అధికారులు 1.30 సెంట్ల భూమి తక్కువ మక్తాకు ఇచ్చారన్నారు. ఆ భూమిలో 40 సెంట్ల వరకూ కొంతకాలంగా అనేక ఆక్రమణలకు గురైనా పట్టించుకోని దేవాలయ అధికారులు సదరు కౌలుదారు వద్ద మొత్తం భూమికి మక్తా కట్టించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలుదారునికి సొంత భూమి లేకపోవడంతో దేవాలయ చట్టం ల్యాండ్ లెస్ పూర్ ప్రకారం పాట పెట్టకుండా అతనికే కొంత కౌలు పెంచి రాయాలన్నారు. అయితే అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పాట పెట్టి రూ.లక్షా పది వేలకు కౌలు పెంచారని తెలిపారు. కౌలురైతుకు కనీసం కౌలు కార్డు ఇవ్వడం లేదన్నారు. కనీసం భూమిలోకి ట్రాక్టర్ వెళ్లేదారి ఆక్రమణకు గురైనా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు.. కౌలురైతు సర్వేశ్వరరావు మాట్లాడుతూ సమస్యపై అనేక ఏళ్లుగా పోరాడుతున్నానని, రెండు నెలలుగా కలెక్టరేట్లో ఫిర్యాదు చేసినా పరిష్కరించలేదని తెలిపారు. భూమి ఆక్రమణకు గురైన నేపథ్యంలో సర్వేచేసి ఎంత భూమి ఉంటే అంతకే కౌలు కట్టించుకోవాలని, కౌలు గుర్తింపు కార్డు ఇచ్చి మక్తా తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.



డిఆర్ఒకు వినతిపత్రం అందజేస్తున్న రామాంజనేయులు

విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాలి


యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు

భీమవరం : విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరణ చేయాలనే ఆలోచనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుస్తున్నాయని, రంగాన్ని కాపాడుకోవడం కోసం ఉద్యోగులు, కార్మికులు మరింత ఐక్యంగా నిలబడాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.సూరిబాబు విజ్ఞప్తి చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో డిస్కం అధ్యక్షులు జె.శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో సూరిబాబు మాట్లాడారు. విద్యుత్తు రంగంలో సంస్కరణల పేరుతో ప్రజలపై భారాలు వేసే విధంగా పాలకుల విధానాలు ఉన్నాయని విమర్శించారు. ఉద్యోగులపై విపరీతమైన పని భారం పెరుగుతోందని, ఎప్పుడూ లేని విధంగా గత ప్రభుత్వం ఇచ్చిన పిఆర్‌సి వల్ల విద్యుత్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. ఇప్పటికైనా విద్యుత్ ఉద్యోగులకు అన్ని రాయితీలూ, సౌకర్యాలూ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రానున్న కాలంలో విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ చేసే ఉద్యమాల్లో ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో విద్యుత్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజుఫర్ అహ్మద్, సిఐటియు జిల్లా కార్యదర్శి రాజా రామ్మోహన్ రాయ్, విద్యుత్ ఉద్యోగులు నాయకులు సురేష్, పాండు రంగరాజు, జోసఫ్ రాజు, బోస్, దత్తు, శ్రీనివాసరాజు, జానకీరామ్ పాల్గొన్నారు.

వంశీ కృష్ణంరాజుకు ఉత్తమ దర్శకుడు అవార్డు

ప్రజాశక్తి - కాళ్ల

ఒక పక్క ఇంజినీరింగ్ చదువుకుంటూనే.. మరో వైపు సినిమాలపై ఆసక్తితో షార్ట్ ఫిల్మ్‌లు తీస్తూ తొలి ప్రయత్నంలోనే అంతర్జాతీయ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రదర్శనలో బెస్ట్ డైరెక్టర్‌గా ఎంపికై అవార్డు అందుకున్నారు. ఈ నెల 20న కోల్‌కత్తాలో జరిగిన 14వ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కాళ్ల మండలం కోపల్లె గ్రామానికి చెందిన ఇందుకూరి రవివర్మ, విజయలక్ష్మి దంపతుల కుమారుడు ఇందుకూరి వంశీ కృష్ణంరాజు 'పర్వాసం' పేరుతో తీసిన షార్ట్ ఫిల్మ్‌కు ఉత్తమ దర్శకుడు అవార్డు అందుకున్నారు. ఈ కథను రాసేటప్పుడు వంశీ కృష్ణంరాజుకు 19 ఏళ్లు. ప్రస్తుతం ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నారు. సినిమా రంగంలో ప్రవేశించాలనే ఆకాంక్షతో హైదరాబాద్‌లోని సినిమాటోగ్రాఫర్ ప్రగ్య వర్ధంరెడ్డిని కలిశారు. ఈ నేపథ్యంలో ఇద్దరూ కలిసి కథను పూర్తి చేశారు. ఈ ఫెస్టివ్‌కు దాదాపు 300 చిత్రాలు వచ్చాయి. వాటిలో 60 సినిమాలకు విభిన్న కేటగిరీల్లో అవార్డులు లభించాయి. ఈ క్రమంలోనే ఉత్తమ దర్శకుని అవార్డు 'పర్వసం'కు లభించింది. వంశీకృష్ణను కోపల్లె గ్రామస్తులు, వంశీ కృష్ణంరాజు కుటుంబీకులు, జువ్వలపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గోకరాజు నాగరాజు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు అందుకున్న వంశీ కృష్ణంరాజు

ఆనందంగా ఉంది : వంశీ కృష్ణంరాజు

ఈ అవార్డును గెలుచుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ అవార్డు కథ, స్క్రీన్‌ప్లే, ఈ చిత్రంలో నేను ప్రదర్శించిన భావోద్వేగాల వల్ల వచ్చిందని భావిస్తున్నాను. ఇది ఒక వివాహిత జంట మధ్య సాగిన కథ. ఈ ఉత్తమ వేదికను అందించిన ఫెస్టివల్ కు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఇంకా భవిష్యత్తులో మంచి చిత్రాలు రూపొందించాలన్నదే ఆశయం.

రైతు సేవకు కృషి చేస్తా..

కొయ్యేటిపాడు పిఎసిఎస్ ఛైర్మన్ పాలా భోగేశ్వరరావు



ప్రజాశక్తి - పెనుమంట్ర

దీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్న తనకు మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ఇచ్చిన అవకాశాన్ని రైతుల సేవకు వినియోగిస్తానని కొయ్యేటిపాడు పిఎసిఎస్ ఛైర్మన్ పాలా భోగేశ్వరరావు అన్నారు. సొసైటీ ద్వారా రైతులందరికీ వ్యవసాయ రంగ అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల సేవలు సకాలంలో అందేలా చేస్తానని ఆయన తెలిపారు.

వాటర్ ట్యాంక్ బహూకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు



వాటర్ ట్యాంకర్ బహూకరిస్తున్న సుధాకర్

పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న డయాలసిస్ కేంద్రానికి వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంకును వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ సోమవారం బహూకరించారు. గత రాత్రి ఒక సీనియర్ పాత్రికేయుడు వాకర్స్ క్లబ్ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు క్లబ్ తరపున రూ.8 వేల విలువైన వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంకును డయాలసిస్ కేంద్రం జోనల్ ఇన్‌ఛార్జి పీ సుధీర్‌కు ఆసుపత్రి ఆవరణలో అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతల ఉమాశంకర్ రావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, టెక్నీషియన్ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిగిన వెంటనే స్పందించి సహకారం అందించిన వాకర్స్ క్లబ్ పాలకొల్లు వారికి జోనల్ ఇన్‌ఛార్జి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయానికి కంప్యూటర్ల బహూకరణ

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయానికి శివ శ్రీవాటికలు(బ్యాంక్(బెంగళూరు) ఆధ్వర్యంలో రెండు కంప్యూటర్లు, ఒక స్మార్ట్ టివి, స్మార్ట్ ఫోన్ బహూకరించినట్లు గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ ద్వారా పీడియ వెబ్ అప్లికేషన్ ద్వారా ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులు భాషా నైపుణ్యం పెంపొందించుకునేటట్లు, రీడింగ్ అండ్ రైటింగ్ స్కిల్స్‌లో అభివృద్ధి సాధించుటకు అవకాశం ఉంటుందన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ చదివే విద్యార్థులకు 500 రకాల కెరీర్ గైడెన్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఉన్నత విద్యను సాధించాలని ఆయన తెలిపారు.

కురుగోరుమిల్లిలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ఆచంట : గత ఐదేళ్ల కాలంలో వైసిపి పాలనలో అరాచకం, విధ్వంసం దోపిడి పాలన సాగించిన దీంతో ప్రజలు జగన్ రెడ్డిని ఇంటికి పంపించి ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం కురుగోరుమిల్లి, వల్లూరు గ్రామాల్లో ఆ గ్రామ సర్పంచులు అల్లం వర్మల్, నేలపూడి బేబీ అధ్యక్షతన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గడపగడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, నేతలు చిలుకూరి సీతారాం, తమ్మిడి ప్రసాద్, బీర నరసింహమూర్తి పాల్గొన్నారు.

నరసాపురం : ప్రజలకు మంచి పాలన అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మైనార్టీ ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ.షరీఫ్ అన్నారు. సోమవారం పట్టణంలోని 17వ వార్డులో టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజులతో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలందించారు. ఎంసిసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, హుసేన్, జక్కం శ్రీ, రాఘవాచార్యులు, మధుసూదనరావు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచి మృతి

పాలకొల్లు రూరల్ : మండలంలోని చందపర్రు గ్రామానికి గతంలో సర్పంచిగా పనిచేసిన రాపాక విజయరత్నం(51) సోమవారం గుండెపోటుతో మరణించారు. ఈ వార్తతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలో అందరికీ సర్పంచిగా ఎన్నో సేవలందించి ప్రజల మన్ననలు పొందారు. ప్రస్తుతం ఈయన ప్రయివేట్ కళాశాలలో ఉద్యోగం చేస్తున్నారు. ఈయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం చేశారు. కుమారునకు చేయవలసి ఉంది. అని గ్రామస్తులు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రిలో సహజ కాన్పులకు కృషి

పాలకొల్లు : ప్రభుత్వ ఆదేశాల మేరకు గర్భిణులకు సహజ కాన్పు అయ్యేలా చూడాలన్న ఆదేశాలను పాటిస్తూ పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సోమవారం ముగ్గురు గర్భిణులకు సహజ కాన్పు అయ్యేలా కృషిచేశారు. ఈ విధంగా వైద్యం చేసే సహజ కాన్పులు చేశారు. ఇందులో భాగంగా ముగ్గురు మగపిల్లలు పూర్తి ఆరోగ్యంగా జన్మించారు. జి.హరిత అనే గర్భిణికి 3.8 కేజీల మగ పిల్లాడికి సహజ కాన్పు అయ్యేలా చేశామని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యర్రా మాధురి తెలియజేశారు. ఈమేరకు గర్భిణులకు ఆసుపత్రిలో వ్యాయామాలు కూడా చేయిస్తున్నట్లు ఆమె తెలిపారు.

నేరాలు - ఘోరాలు

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని భగ్గేశ్వరం గ్రామానికి చెందిన పాల గంగారత్నం(55) పోస్ట్ ఆఫీస్ పని మీద బంటకోటకు వెళ్లి తిరిగి వస్తుండగా బంటకోటకు దగ్గర లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. గంగారత్నంకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందిందని పోలీసులు తెలిపారు. గంగారత్నంకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొడుకు విస్సేశ్వర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేంద్ర కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కాళ్ల

జక్కరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. కాళ్ల ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొండాడపేట గ్రామశివారు నేరేడుగుంట ప్రాంతానికి చెందిన బొర్రా శివయ్య(45) కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శివయ్యకు ఒక కుమారుడు, కుమార్తె సంతానం కలిగి ఉన్నారు. సోమవారం కూలీ పని నిమిత్తం వెళుతుండగా జక్కరం గ్రామంలోని శ్మశానవాటిక వద్ద భీమవరం వైపు నుంచి సీసలి వైపు వస్తున్న వాటర్ ట్యాంకర్ కూలీ ఢీకొట్టింది. దీంతో శివయ్య అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. దీనిపై మృతుడు భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనుమంట్ర : పాఠశాల తెరిచే వేళలో పెనుమంట్ర సంత మార్కెట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెనుమంట్ర గ్రామం శివారు బ్రాహ్మణ చెరువు ప్రాంతానికి చెందిన పి.వైష్ణవి(12) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. సోమవారం యధావిధిగా ఇంటి నుంచి సైకిల్‌పై స్కూలుకి వెళుతుండగా స్థానిక నెగ్గిపూడి-మార్టేరు రహదారి సంత మార్కెట్ దగ్గరకి వచ్చేసరికి అత్తిలి గ్రామానికి చెందిన కె.రామకృష్ణ(37) మోటార్ సైకిల్‌పై విద్యార్థిని బలంగా ఢీకొనడంతో ఇద్దరూ కింద పడిపోయారు. ఈ సంఘటనలో ఇద్దరికీ కాళ్లు విరిగిపోయాయి. వెంటనే స్పందించిన స్థానికులు పెనుమంట్ర 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వాహన సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మెడికల్ టెక్నీషియన్ బాలకృష్ణ, పైలట్ మహేష్ సహకారంతో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

9 మంది అరెస్ట్

భీమవరం టౌన్ : స్థానిక ఇండస్ట్రియల్ ఏరియా పరిధిలో పేకాట స్థావరంపై దాడి చేసి, 9 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.లక్ష 43 వేల 630 స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సిఐ నాగరాజు తెలిపారు. సోమవారం ఆయన వివరాలను వెల్లడించారు. నిషేధిత జూదం ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి.వై.కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.




రంగం నాయుడుని సత్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

రంగం నాయుడుకి సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించి రాష్ట్రస్థాయి అవార్డును కూడా డాక్టర్ రంగం నాయుడు సాధించాలని డాక్టర్ సునీల్ ఆకాంక్షించారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ అధ్యక్షతన కాళ్ల వైద్యాధికారి డాక్టర్ రంగం నాయుడుకి సోమవారం సత్కార సభ నిర్వహించారు. ఈనెల 16వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ వైద్యాధికారి అవార్డును జిల్లా కలెక్టర్ సిహెచ్.నాగరాణి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.గీతాబాయి చేతుల మీదగా అందుకున్న విషయం తెలిసిందే. జిల్లాలో ఎక్కువ వాసెక్టమీ కేసులు నిర్వహించినందుకు ఈ అవార్డును, ప్రశంసా పత్రాన్ని, రూ.7 వేల బ్యాంకు చెక్కును అందించారు. వైద్యాధికారులు డాక్టర్ డి.సునీత, డాక్టర్ టి.భావన, సిహెచ్ఒ ఎన్.నాగమణి, సిబ్బంది పాల్గొని డాక్టర్ రంగం నాయుడుని అభినందించారు.



గణపతి కుటుంబాన్ని పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

గణపతి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని పెనుమర్రు గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతిపరురాలు దిగుమర్తి వెంకటలక్ష్మి(70) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఆమె భర్త గణపతి, వారి కుమారులు, కుమార్తెలను సోమవారం సిపిఎం జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, శాఖా కార్యదర్శి లూటుకుర్తి భాస్కరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా జార్జి, బాలరాజులు మాట్లాడుతూ వెంకటలక్ష్మి భర్త గణపతి సిపిఎం నాయకునిగా అందరికి సుపరిచితులని, వెంకటలక్ష్మి కూడా భర్తతోపాటు అనేక ఉద్యమ కార్యక్రమాలలో ఎంతో చురుగ్గా పాల్గొనే వారని గుర్తుచేశారు. వారివెంట సిపిఎం నాయకులు మొమ్మిడివరపు ఆంజనేయులు, తెన్నేటి స్టాలిన్, పల్లేరు వెంకటస్వామి, తెన్నేటి శివాజీ, భారతుల పద్మరాజు పాల్గొన్నారు.

'పిజిఆర్ఎస్'కు పలు ఫిర్యాదులు


ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లా ఎస్‌పి కార్యాలయంలో సోమవారం జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఎస్‌పికి జిల్లా వ్యాప్తంగా పలు సమస్యలపై పది ఫిర్యాదులు ఇచ్చారు. ఎస్‌పి స్వయంగా ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకుని ఫిర్యాదులు స్వీకరించారు. అలాగే ఫిర్యాదుదారుల ఆయా స్టేషన్ పరిధిలోని పోలీస్ అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదిపై లోతైన విచారణ చేపట్టి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ శ్రీదేశంశెట్టి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో నాలుగు వినతులు వచ్చాయని తహశీల్దార్ కె.రాజ కిషోర్ తెలిపారు. భూ సర్వే నిర్వహించాలని కోరుతూ ఒకటి, నిషేధిత భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఒకటి, రేషన్ కార్డుకు ఒకటి, కాళీపట్నంలోని భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ ఒకటి వినతులు వచ్చాయని తహశీల్దార్ తెలిపారు.

నరసాపురం : పిజిఆర్ఎస్‌లో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 71 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించారు. స్వీకరించిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన త్రిసభ్య కమిటీ సభ్యులు

పెనుగొండ రూరల్ : మండలంలోని వడలి గ్రామంలో సొసైటీ త్రిసభ్య కమిటీ సోమవారం బాధ్యతలు స్వీక రించారు. కట్టా వెంకట రామకృష్ణ ఛైర్మన్‌గా, యర్రంశెట్టి ... మధుసూదనరావు, పిల్లి శ్రీనివాస్ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అవసరాలను గుర్తించి పరిష్కరిస్తామని, సొసైటీ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాటి చంటి, మూడు గ్రామాలకు చెందిన రైతులు, కూటమి నేతలు పాల్గొని కమిటీ సభ్యులను అభినందించారు.

ఎఎంసి ఛైర్మన్‌గా బొల్లా బాధ్యతలు

ప్రజాశక్తి - ఆకివీడు



బాధ్యతలు స్వీకరిస్తున్న బొల్లా వెంకట్రావు

వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఎఎంసి) ఛైర్మన్‌గా నియమితులైన బొల్లా వెంకట్రావు సోమవారం అధికార బాధ్యతలు స్వీకరించారు. సుమారు 6 నెలల క్రితం ప్రకటించిన ఈ ఛైర్మన్ పదవికి సుమారు వారం రోజుల క్రితం నియామకపు ఉత్తర్వులు జారీ చేసి మూడు రోజుల క్రితం వెంకట్రావుకు ఆ పత్రాలు టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి రామ వరప్రసాద్ అందజేశారు. ఈనెల 25వ తేదీ శుక్రవారం అట్టహాసంగా పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయితే అంతలోనే హడావిడిగా సోమవారం మధ్యాహ్నం వెంకట్రావు కార్యదర్శి యు.యోగేశ్వరరావు నుంచి కుటుంబ సభ్యులు, పార్టీ ప్రముఖుల నడుమ ఈ అధికార బాధ్యతలు స్వీకరించడం గమనార్హం.

మురుగు సమస్యకు మోక్షం

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


ప్రజాశక్తి - ఆచంట

ఆచంట పెద్ద పేట 11వ వార్డులో గత మూడు దశాబ్దాల నుంచి రహదారి లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పలుసార్లు అధికారులు, పత్రికల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎట్టకేలకు అధికారులు స్పందించి సీసీ రోడ్డుకు నిధులు మంజూరు చేశారు. ఈ పనులను సోమవారం అధికారులు ప్రారంభించారు. వర్షాకాలం నేపథ్యంలో కాలనీలో మురుగునీరు బయటకు పోయే మార్గం ఉండేది కాదు. దీంతో రోజుల తరబడి వర్షం నీరు, వాడకం నీరు నిల్వ ఉండి దోమలతో అనేక రోగాల బారిన పడి అనేక ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో ఆ వార్డు సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

80 శాతం సబ్సిడీతో డ్రోన్ల మంజూరు

మండల వ్యవసాయాధికారి పి.రమేష్ నాయుడు

చిట్ - చాట్



ప్రజాశక్తి - కాళ్ల

మండలానికి ప్రభుత్వం ఒక డ్రోన్ మంజూరు చేసిందని మండల వ్యవసాయాధికారి పి.రమేష్‌నాయుడు తెలిపారు. ఒక్కో డ్రోన్ విలువ రూ.18 లక్షలని, 5 మంది రైతులు కలిసి రూ.2 లక్షలు(20 శాతం) చెల్లిస్తే మిగిలిన మొత్తం సబ్సిడీతో ప్రభుత్వం డ్రోన్లు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో పలు అంశాలు ముచ్చటించారు.

ప్రశ్న : భూసార పరీక్ష కార్డులు వచ్చాయా? ఎప్పుడు ఇస్తారు?

ఎఒ : ఇప్పటివరకు మండలంలో 320 మట్టి నమూనాలు తీసి పంపాం. ఇంకా ఫలితాల కార్డులు రాలేదు. నెలాఖరులోగా వస్తే రైతులకు అందజేస్తాం.

ప్రశ్న : అన్నదాత సుఖీభవ ఎప్పుడు విడుదల చేస్తారు?

ఎఒ : ఈ పథకానికి సంబంధించి రైతుల వివరాలు తీసుకుని ఇకెవైసి చేయించాం. అర్హుల జాబితా వచ్చింది. రైతుల నుంచి గ్రీవెన్స్ చేస్తే వాటిని తీసుకుని పూర్తి జాబితా వచ్చాక ఇచ్చే అవకాశం ఉంది.


ప్రశ్న : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు ఏవేవి అడుగుతున్నారు?

ఎఒ : రెండు రోజుల పాటు నాలుగు పంచాయతీల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహిస్తున్నాం. రైతులు వ్యవసాయ పరికరాలు, జింకు, జిప్సమ్ సబ్సిడీ కింద ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం.

యువత అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

విగ్రహావిష్కరణలో ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ

భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన తరగతుల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయాలతో యువత ముందడుగు వేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంచిలి గ్రామంలో ఆలూరి చిన్నారావు, శ్రీనివాసరావు సోదరులు ఏర్పాటుచేసిన అంబేద్కర్ నూతన విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ భావజాలాన్ని సమాజానికి అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గణేశుల శేష వాణి, ఎంపిపి సూర్య కుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, టిడిపి మండల అధ్యక్షులు చిలుకూరి సీతారాం, జనసేన మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ, యువ నాయకులు పాల్గొన్నారు.

పచ్చి రొట్ట వినియోగించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని వ్యవసాయాధారిత భూములలో ఎరువుల వినియోగం తగ్గించి పచ్చిరొట్ట వినియోగించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా 'పచ్చిరొట్ట పైర్లకు వాడడం ద్వారా చేకూరే ప్రయోజనాలపై' గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ అధిక ఎరువుల వినియోగం కారణంగా భూసారం దెబ్బతిని జీవం కోల్పోవడంతో భూమి సాగుకు పనికి రాకుండా పోతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుతో మట్టికి జీవం వస్తుందని తెలిపారు. వర్షాకాలానికి ముందు పొడి విత్తనాలను వెదజల్లడం ద్వారా పచ్చి రొట్టె ఎరువులు పొందవచ్చు అన్నారు. నేలసారం పెంపు, ఆరోగ్యకరమైన నేల, పోషకాలు వృథా తగ్గుతుందన్నారు. సాగు ఖర్చులు తగ్గిస్తుందని తెలిపారు. బయో ఫెర్టిలైజర్స్‌ను 6 నుంచి 12 నెలల కాల పరిమితి లోపు వినియోగించాలని, రసాయనిక ఎరువులు కీటకనాశనాలతో కలిపి వేయకూడదని, నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు వాడటం మంచిదని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు ఉన్నారు.

ప్రజలకు నాణ్యమైన మందులు అందించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం టౌన్



సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే మెడికల్ షాపుల్లో (ఔషధ నిపుణులు) ఫార్మాసిస్ట్ లు ప్రజలకు నాణ్యమైన మందులను అందించాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం జోన్ కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యాన యాంటీ బయాటిక్స్, నార్కోటిక్స్, డ్రగ్స్ అవగాహనా సదస్సును సోమవారం భీమవరం ఆనంద్ ఇన్‌లో నిర్వహించారు. ఎంఎల్ఎ అంజిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవచుకోవాలని, తద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. నాణ్యత గల మందులను ఇవ్వడం వల్ల రోగుల జీవితం ఆధారపడి ఉంటుందని, అటువంటి మందులను ఇవ్వడానికి మెడికల్ షాపుల్లో ఔషధ నిపుణులు అహర్నిశలూ సమయం వెచ్చిస్తున్నారన్నారు. జిల్లా ఔషధ నియంత్రణా అధికారి, భీమవరం డ్రగ్ ఇన్‌స్పెక్టర్, జంగారెడ్డిగూడెం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబిద్ అలీ షేక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపుల్లో ఔషధ నిపుణులు అర్ధరాత్రి తలుపు కొడితే సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్, లైసెన్సింగ్ అథారిటీ(ఏలూరు) డిబిఎం చక్రవర్తి, డాక్టర్ సందీప్ వర్మ పాల్గొన్నారు.


రానున్నదంతా రోబో టెక్నాలజీనే

స్వర్ణాంధ్ర కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ

నరసాపురం: ఇంజనీరింగ్లో రోబోటెక్ విద్యకు ఉజ్వల భవిష్యత్ ఉందని, రానున్నదంతా రోబోటెక్ టెక్నాలజీనేనని స్వర్ణాంధ్ర కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ అన్నారు. సోమవారం స్వర్ణాంధ్రలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఐసిటీ అకాడమి ఆధ్వర్యాన నిర్వహించిన శిక్షణ తరగతుల్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యలో వస్తున్న మార్పుల్ని విద్యార్థులు ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కోర్సుల్లో శిక్షణ పొందాలన్నారు. ఐసిటీ అకాడమి సిఇఒ దినకర్ రెడ్డి మాట్లాడుతూ ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఐసిటీ సంయుక్తంగా 15 రోజుల పాటు బిటెక్ నాల్గవ తరగతి విద్యార్థులకు రోబోటెక్ శిక్షణ ఇస్తున్నామన్నారు. సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. తొలి విడతగా 65 మందిని ఎంపిక చేసామన్నారు. దీనికి సంబంధించిన ఒప్పంద పత్రాన్ని కళాశాల డైరెక్టర్ శ్రీహరి, ప్రిన్సిపల్ సురేష్ కుమార్‌కు అందించారు. కోశాధికారి త్రినాథ్, వైస్ ప్రిన్సిపల్ గోపిచంద్ పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి - తణుకు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు తణుకు ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల ఆవరణలోని చిట్టూరి సుబ్బారావు, సత్యఉషారాణి ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిట్టూరి రీనాసాయి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ మెంటే వంశీకృష్ణ, జిల్లా అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కంటిపూడి రాంబాబు, జిల్లా జాయింట్ సెక్రటరీ జవ్వాది కిషోర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సమ్మెట్ల సతీష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ ఇందుకూరి కిషోర్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చిట్టూరి రీనాసాయి మాట్లాడుతూ విజేతలైన క్రీడాకారులు త్వరలో జరగబోయే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.రత్నకుమారి, అకాడమీ కోచ్ యు.సుదర్శన్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి : సిపిఎం

పాలకొల్లు : విద్యుత్ స్మార్ట్ మీటర్‌లు రద్దుచేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కొబ్బరి వర్తకుల భవనంలో 2 రోజుల పాటు జరిగే జిల్లా ముఖ్య కార్యకర్తలకు రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులు ప్రారంభిస్తూ గోపాలన్ మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు అదానీ మెప్పు కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తెస్తుందన్నారు. తొలుత తరగతుల ప్రారంభ సూచనగా సీనియర్ నాయకులు ఎర్రా కృష్ణారావు జెండా ఆవిష్కరించారు. ఉదయం చింతకాయల బాబురావు నయా ఉదారవాద విధానాలు-ప్రజలపై ప్రభావం అంశం బోధించారు. మధ్యాహ్నం తరగతిని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం మతోన్మాద ప్రమాదం-ఎదుర్కొనే పద్ధతులు అంశం బోధించారు. ఈ తరగతులకు బి.వాసుదేవరావు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కౌరు పెద్దిరాజు, జవ్వాది శ్రీనివాసరావు, దిగుపాటి రాజగోపాల్, చల్లా సోమేశ్వరరావు, యర్రా అజయ్, దేవ సుధాకర్, బాతిరెడ్డి జార్జి, పురుషోత్తం, కానేటి బాలరాజు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారు ఓటు నమోదు చేసుకోవాలి : కలెక్టర్

భీమవరం : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటర్ జాబితాలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ నాగరాణి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2026 జనవరి 1 నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చునన్నారు. అదే సమయంలో మృతి చెందిన వ్యక్తులు, గ్రామం వదిలి శాశ్వతంగా వలస వెళ్లిన వారు, ఒకే వ్యక్తి పేరు రెండు సార్లు నమోదైన వారి పేర్లు ఓటర్ జాబితా నుంచి తొలగించబడతాయన్నారు. సమావేశంలో డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఎలక్షన్ సెక్షన్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ మద్రాపు సన్యాసిరావు, టిడిపి తరపున మరపట్ల శ్యాంబాబు, జనసేన తరపున జైశివ, బిఎస్‌పి తరపున ఎం.రత్నరాజు, సిపిఎం తరపున మల్లిపూడి ఆంజనేయులు, ఎం.రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడు అభ్యంతరాల స్వీకరణ

ఆకివీడు : మండలంలోని అజ్జమూరు నుంచి జాతీయ రహదారి 165 విస్తరణలో భాగంగా ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ ద్వారా ప్రకటించిన అంశాలపై చర్చించేందుకు జెసి రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో రైతులు, ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారని తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశం మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందన్నారు. ఈ విస్తరణలో ల్యాండ్ ఎక్విజేషన్‌కు సంబంధించి రైతుల నుంచి అభ్యంతరాలు జెసి స్వీకరిస్తారన్నారు.

ఎల్‌ఒసి అందజేత

తాడేపల్లిగూడెం : మండలంలోని దండగర్ర గ్రామానికి చెందిన మూడేళ్ల బాలుడు మిద్దె మణికంఠ కిషోర్ అత్యవసర వైద్యం నిమిత్తం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సోమవారం రూ.3.5 లక్షలకు సిఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఒసి అందించినట్లు గ్రామ సర్పంచి పిల్లా రాంబాబు తెలిపారు. విజయవాడ ఆంధ్ర హాస్పటల్లో ఐసియులో చికిత్స పొందుతున్న బాలుని అత్యవసర వైద్యం నిమిత్తం ప్రభుత్వ సాయం కోరిన వెంటనే హుటాహుటిన వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఆర్థికంగా సహకారం అందించిన ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌కు సర్పంచి పిల్లా రాంబాబు, ఉప సర్పంచి కాసాని రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్‌కు నిరసన

పెనుమంట్ర : ఎంపీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తూ సోమవారం మార్టేరు సెంటర్లో వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైసిపి శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. సిఎం డౌన్ డౌన్, ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం.. గుండాల రాజ్యం దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం అని నినాదాలు ఇచ్చారు. అనంతరం పోడూరు, పెనుమంట్ర, జెడ్‌పిటిసి సభ్యులు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ ప్రతీకారంతో మిథున్ రెడ్డిని కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిందని అన్నారు. ఇటువంటి అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తుందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మట్టకుమారి రాము, జెడ్‌పిటిసి కర్రి సుభాషిని, వైసిపి సీనియర్ నాయకులు, మార్టేరు గ్రామ ఉపసర్పంచి కర్రి వేణుబాబు, మండల సర్పంచుల చాంబర్స్ అధ్యక్షులు సుంకర సీతారాం, ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం పాల్గొన్నారు.

నరసాపురం: మిథున్ రెడ్డిపై కూటమి ప్రభుత్వం సంబంధం లేని అక్రమ కేసులు నమోదు చేయడం దుర్మార్గమని వైసిపి జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షులు బుడితి సుమన్ కుమార్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. వైసిపి నాయకులను బయపెట్టాలని కూటమి ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా తిప్పికొడతామన్నారు.

ఎడిగా మురళీకృష్ణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులుగా పి.మురళీకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తాడేపల్లిగూడెం నుంచి బదిలీపై పాలకొల్లు విచ్చేశారు. ఆయన 2015 వరకు పాలకొల్లులో ఎడిగా పనిచేశారు. ఇక్కడ ఎడిగా పనిచేసిన అడపా పార్వతి కైకలూరు ఎడిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మర్యాద పూర్వకంగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిశారు.

రేపు వైఎన్‌లో జాబ్ మేళా

నరసాపురం: ఈనెల 23వ తేదీన శ్రీవైఎన్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి డాక్టర్ అందే రామ్ సతీష్ తెలియజేశారు. ఈమేళాలో 16 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, ముఖ్యంగా ఫార్మా, వివిధ బ్యాంకులు, సంస్థల నుంచి పాల్గొని ఎంపికలు నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకారావు మాట్లాడుతూ నరసాపురం పరిసర ప్రాంత నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళా కార్యక్రమం విప్ బొమ్మిడి నాయకర్ ప్రారంభిస్తారని, జిల్లా కలెక్టర్ నాగరాణి పాల్గొని పర్యవేక్షిస్తారని తెలిపారు.